## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం సహాయనిధితో పేదలకు మేలు జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో నర్సాపూర్, కౌడిపల్లి, హత్నూర మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

### దోమల నివారణకు చర్యలు



ద్రావణం పిచికారీ చేస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దోమలు ప్రబలే అవకాశం ఉండటంతో నివారణ చర్యలు చేపట్టారు. కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు మంగళవారం పలు కాలనీల్లో దోమల నివారణకు సంబంధించి టీమిఫాస్ ద్రావణం పిచికారీ ప్రారంభించారు. శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షణలో మురుగుకాల్వలు, ఖాళీ ప్రదేశాలు, నీటి గుంటల్లో ద్రావణాన్ని పిచికారీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు డెంగీ వ్యాధిని కలుగజేసే దోమలు ప్రబలకుండా ఖాళీ కొబ్బరి బోండాలను ఎక్కడపడితే అక్కడ పారవేయొద్దని కమిషనర్ పట్టణవాసులకు సూచించారు.

### అక్రమ నిర్మాణాలు ఆపండి

ఆర్ఐ జయప్రకాష్ నారాయణ



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్ఐ

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 27 తెలంగాణ కాలనీలోని అసైన్డ్ భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై స్థానికులు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాష్ నారాయణ మంగళవారం తెలంగాణ కాలనీలో పర్యటించారు. పునాదుల స్థాయికి చేరిన అక్రమ నిర్మాణ పనులను వెంటనే ఆపేయాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### వర్షంతో అప్రమత్తంగా ఉండాలి

ఏఓ వెంకటేశం



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ

కల్హేర్(నారాయణఖేడ్): అకాల వర్షంతో ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ వెంకటేశం సూచించారు. మంగళవారం కల్హేర్‌లో వరి, జొన్నల కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. వరి, జొన్నలు విక్రయించేందుకు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు సంతోష, కృష్ణవేణి పాల్గొన్నారు.

### జోరుగా అక్రమ మట్టి రవాణా



అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో అక్రమ మట్టి రవాణా జోరుగా సాగుతోంది. సోమవారం అర్ధరాత్రి కిష్టయ్యపల్లి గ్రామ శివారులోని ఇటుక బట్టీలకు టిప్పర్లతో భారీగా మట్టిని తరలించారు. మట్టి తరలించే సమయంలో వాహనాల శబ్దాలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నత్తనడకన ధోబీ ఘాట్ల పనులు

- తొమ్మిదేళ్లుగా పూర్తికాని నిర్మాణాలు
- ఇబ్బందులు పడుతున్న రజకులు



హద్నూర్‌లో నిరుపయోగంగా ఉన్న ధోబీ ఘాట్లు



శిథిలావస్థకు చేరుకుంటున్న ధోబీ ఘాట్లు

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నా అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల సకాలంలో పూర్తి కావడం లేదు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ వాటిని సకాలంలో పూర్తి చేయక నిధులు దుర్వినియోగమవుతున్నాయి. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్వయం ఉపాధి కింద కులవృత్తుల వారికి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం రజకులకు ధోబీ ఘాట్లను మంజూరు చేసింది. ధోబీ ఘాట్లు మంజూరై తొమ్మిదేళ్లు గడిచినా ఒకటి రెండు నిర్మాణాలు మినహా మరెక్కడా పూర్తి కాలేదు.

**పూర్తి సబ్సిడీపై మంజూరు**

స్వయం ఉపాధి పథకం కింద పూర్తి సబ్సిడీపై ప్రభుత్వం జిల్లాకు ధోబీ ఘాట్లను మంజూరు చేసింది. వెనుకబడిన సంక్షేమశాఖ ద్వారా 2014–2015, 2015–2016 సంవత్సరానికి జిల్లాకు 9 ధోబీ ఘాట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటి నిర్మాణానికి రూ.44.80లక్షలను విడుదల చేసింది. ఒక్కో ధోబీ ఘాట్ నిర్మాణానికి రూ.5.60లక్షలు కేటాయించింది. జిల్లాలోని సంగారెడ్డి మండలంలోని ఆరుట్ల, చెరియాల్. పుల్‌కల్ మండలంలోని గంగ్లూర్.. జిన్నారం మండలంలోని గుమ్మడిదల.. న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్, రాంతీర్థ్.. సదాశివపేట్ మండలంలో కొల్కూర్.. కొండాపూర్ మండలంలోని మారెపల్లి.. హత్నూర మండలంలోని వడ్డేపల్లికి ధోబీ ఘాట్లు మంజూరయ్యాయి. ధోబీ ఘాట్లు హద్నూర్, కోరుట్ల, చేర్యాలలో మాత్రమే పూర్తయ్యాయి. మిగతా ఆరు ధోబీ ఘాట్ల నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. హద్నూర్‌లో నిర్మాణ పనులు పూర్తి అయినప్పటికీ చిన్నచిన్న పనులు మిగిలిపోయాయని గ్రామ రజకులు పేర్కొంటున్నారు. ధోబీ ఘాట్లు వినియోగంలోకి రాక నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. రాంతీర్థ్‌లో బోరు వేసి మోటారును కూడా అమర్చారు. గది, నీటి తొట్లను నిర్మించారు. నీటి తొట్ల నుంచి నీరు లీకేజీ అవుతుందని రజకులు తెలిపారు. నిర్మించిన కట్టలు కూడా సక్రమంగా లేవని ఆరోపించారు. ఇంకా చాలా పనులు అసంపూర్తిగానే ఉన్నాయని వారు చెబుతున్నారు. వాటిని పట్టించుకోకపోవడంతోఅవి శిథిలావస్థకు చేరాయి.

**అరకొర ఆదాయంతో ఇబ్బందులు**

అధికశాతం రజక కుటుంబాలు కూలినాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. గతంలో కులవృత్తిపై ఆధారపడిన వారికి ధాన్యం రూపంలో భత్యం ఇచ్చేవారు. ప్రస్తుతం ధాన్యం దొరకక.. ఒక్కో కుటుంబం నుంచి ఆరు నుంచి ఎనిమిది వందల రూపాయలు మాత్రమే వస్తున్నాయి. మరో వైపు బట్టలు ఉతికేందుకు దగ్గరలో చెరువులు, కుంటలు లేకపోవడంతో వ్యవసాయ బోరు బావులను ఆశ్రయించాల్సి వస్తుందని రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్బందులను భరించలేక చాలా మంది కులవృత్తులకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని అసంపూర్తిగా ఉన్న ధోబీ ఘాట్ల నిర్మాణం పనులను పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకురావాలని రజకులు కోరుతున్నారు.

**నిరుపయోగంగా ఉన్నాయి**



గ్రామ సమీపంలో నిర్మించిన ధోబీ ఘాట్లు చాలా రోజుల నుంచి నిరుపయోగంగా ఉన్నాయి. ప్రారంభంలో కొన్ని రోజులు మాత్రమే వినియోగించుకున్నాం. తరువాత బోరు మోటారు పాడై పోవడంతో ఎవరు పట్టించుకోలేదు. అప్పటి నుంచి అవి నిరుపయోగంగా ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకొని వినియోగంలోకి తేవాలి.

–నర్సింహులు రజకుడు, హద్నూర్

**చర్యలు తీసుకుంటాం..**

జిల్లాకు అప్పట్లో తొమ్మిది ధోబీ ఘాట్లు మంజూరయ్యాయి. వాటిలో కొన్ని పూర్తయ్యాయి. మిగతావి నిధులు కొరత కారణంగా నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేసేందుకు ప్రస్తుతం ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరైతే పనులు పూర్తి చేయిస్తాం.

– జగదీశ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి

# విద్యాభ్యాసంపై ఆసక్తి పెంచాలి



రాయికోడ్: మాట్లాడుతున్న ఎంఈఓ మాణయ్య



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మారుతి రాథోడ్



కల్హేర్: మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

ఎంఈఓ మాణయ్య

రాయికోడ్(అందోల్): విద్యాభ్యాసంపై పిల్లలకు ఆసక్తి పెంచేలా బోధన ప్రక్రియను కొనసాగించాలని మండల విద్యాధికారి టి.మాణయ్య ఉపాధ్యాయులకు సూచించారు. రాయికోడ్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు ఐదు రోజులు ఇన్ సర్వీస్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అక్షర గుర్తింపు, ధ్వని గుర్తింపు కృత్యాల నిర్వహణపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. అక్షరాలు, పదాలు, వాక్యాలు, పేరాలను దారాళంగా చదివిలా బోధించాలన్నారు. శిక్షణకు వందశాతం హెచ్ఎంలు, ఉపాధ్యాయులు హాజరయ్యారని తెలిపారు. తొలిరోజు శిక్షణలో డీఆర్పీ తులసి ఉపాధ్యాయులకు ఇంగ్లీషు బోధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఖైరత్ అలీ, శ్రీనివాస్, హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

**శిక్షణతో మంచి ఫలితాలు**

న్యాల్‌కల్(జహీరాబాద్): శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో ప్రదర్శిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎంఈఓ మారుతి రాథోడ్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మిర్జాపూర్(బి) జెడ్పీహెచ్ఎస్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్‌పై శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3వ తరగతి పూర్తయ్యే వరకు ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, మాట్లాడడం రావాలన్నారు. శిక్షణ ఇచ్చేందుకు 8 మంది ఆర్పీలను నియమించినట్లు వివరించారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

హత్నూర(సంగారెడ్డి): ఐదు రోజుల జరిగే శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వెంకట నరసింహగౌడ్ తెలిపారు. మంగళవారం హత్నూర మండలం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులను ఎంఈఓ ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస అభ్యాసన సమర్థన సాధనను పెంపొందించుకునేందుకు శిక్షణ తరగతులను ఉపాధ్యాయులకు అందిస్తున్నట్లు తెలిపారు.

**రామచంద్రాపురం మండలంలో..**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పని చేసే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ పాఠశాలలో ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓ పీపీ రాథోడ్ ప్రారంభించారు.

**జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో..**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జహీరాబాద్ మండలంలోని టీచర్లకు స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మొగుడంపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ తరగతులు తీసుకుంటున్నారు.

**నూతన పద్ధతుల్లో బోధన చేయాలి**

వట్‌పల్లి(అందోల్): ఉపాధ్యాయులు నూతన పద్ధతుల ద్వారా విద్యార్థులకు బోధించాలని మండల విద్యాధికారి గోవింద్‌రెడ్డి అన్నారు. మంగళవారం వట్‌పల్లి ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాలన్నారు.

**ఉపాధ్యాయులకు శిక్షణ**

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో మంగళవారం ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఎంఈఓలు జి.శ్రీనివాసులు, నాగరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించాలని సూచించారు.

# కనీస వేతనాలు అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీల్లో వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్, డ్రైవర్లుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సంబంధిత సిబ్బందితో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, నూనె, బెల్లం, టవళ్లు, చెప్పులు, గుర్తింపు కార్డులు తదితర కనీస సదుపాయాలు అమలు కావడం లేదని ఆరోపించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ జగ్జీవన్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవి, సాయిలు, గోపాల్, శేఖర్, ప్రవీణ్, నారాయణ, ఆదాం, సంగన్న పాల్గొన్నారు.

### హాల్ టికెట్ల పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్, న్యాల్‌కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ కొనసాగుతుంది. ఈనెల 22 నుంచి 29 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగనున్నాయి. సంబంధించిన హాల్ టికెట్లను ఆయా కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. మంగళవారం విద్యార్థులకు అధ్యాపకులు హాల్ టికెట్లను అందజేశారు.

### దాతలు ముందుకు రావాలి

నారాయణఖేడ్: ఖేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి కోరారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ.. గతంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, నేరాల నియంత్రణకు ఎంతగానో ఉపకరించాయన్నారు. పలు నేరాల్లో నిందితులను పట్టుకోవడానికి దోహదపడ్డాయని తెలిపారు. రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, షాపింగ్‌మాల్స్ నిర్వాహకులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు.

### కార్మికుల నిరసన

జిన్నారం (పటాన్‌చెరు): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ గుమ్మడిదల మున్సిపాలిటీ బొంతపల్లి పారిశ్రామిక వాడలోని న్యూల్యాండ్ పరిశ్రమ ఎదుట కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నినాదాలు చేస్తూ కరపత్రాలను ప్రదర్శించారు.

# ధూప, దీప నైవేద్య పథకంతో లబ్ధి



మాట్లాడుతున్న రాములునాయక్

మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్

నారాయణఖేడ్: ప్రభుత్వం అందిస్తున్న ధూపదీప నైవేద్యం పథకాన్ని గిరిజన తండాల్లోని ఆలయాల్లో పూజలు చేసే పూజారులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ కోరారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ దేవాలయంలో ధూపదీప నైవేద్యాలు ఉండాలని వేతనం, పూజలకు ఆర్థిక సహాయం అందించేందుకు పూజారుల నుంచి దరఖాస్తులు కోరిందన్నారు. ఈ నెల 24లోగా అర్హులైన పూజారులు దరఖాస్తులు చేసుకోవాలని, ఆయా ఆలయాల పూజారులు రెండు గుడి ఫొటో లను తమ ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకంతో పాటు ఫారం నెం.43తో దరఖాస్తును పూరించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు ప్రకాష్ రాథోడ్, మాజీ జెడ్పీటీసీలు రాజు రాథోడ్, రూప్‌సింగ్, ఎస్టీసెల్ నాయకులు నెహ్రూనాయక్, సురేష్ నాయక్, నారాయణ, గణేష్, మోహన్, బాబు పాల్గొన్నారు.

# పడకేసిన పారిశుద్ధ్యం



బూచినెల్లిలో పేరుకుపోయిన చెత్త

జహీరాబాద్ టౌన్: పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామ ప్రజలు, పంచాయతీ కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. కార్యదర్శులకు పంచాయతీల నిర్వహణ తలకు మించిన భారంగా తయారయింది. పల్లెలు పచ్చదనం, పరిశుభ్రతకు నిలయంగా ఉండాలన్న ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లను సమకూర్చింది. జనాభా ఆధారంగా పారిశుద్ధ్యం కార్మికులను కూడా నియమించింది. వారం రోజుల వరకు చెత్త సేకరణ లేక ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. మండలంలోని బూచినెల్లి గ్రామంలో పది రోజుల నుంచి చెత్త సేకరణ చేపట్టడం లేదని ప్రజలు వాపోయారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఈ పాస్ లేకుండా ఎరువులు విక్రయించొద్దు

ఏడీఏ భిక్షపతి



ఈ పాస్ మిషన్ పంపిణీ చేస్తున్న భిక్షపతి

జహీరాబాద్ టౌన్: ఈ పాస్‌లో నమోదు చేయకుండా ఎరువులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి హెచ్చరించారు. మంగళవారం ఫర్టిలైజర్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరిహద్దు కర్నాటక రాష్ట్రం నుంచి ఎరువులు అక్రమంగా తరలించే అవకాశం ఉందన్నారు. పక్క రాష్ట్రానికి అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఆధార్ కార్డు లింక్ చేసిన తరువాత ఎరువులు అమ్మాలని తెలిపారు. డీలర్లు ఎరువుల ఎంత దిగుమతి చేసుకుంటున్నారు.. ఎంత అమ్ముతున్నారనే విషయం గల్లీ నుంచి ఢిల్లీ వరకు తెలిసే అవకాశం ఉందన్నారు. ఈ పాస్‌లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో జహీరాబాద్, మొగుడంపల్లి తదితర మండలాల ఏఓలు లావణ్య, అఖిలాష్, వర్మ, వినోద్‌కుమార్, హప్సోద్దీన్, శ్రీకాంత్, రాహుల్, ఏఈఓ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి విత్తనాల నమూనాల సేకరణ

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ఫర్టిలైజర్ దుకాణాల్లోని పత్తి విత్తనాల నమూనాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి సారిక సేకరించారు. గ్రోమోర్, కేతకీ, రైతుమిత్ర, తదితర ఫర్టిలైజర్స్ దుకాణాల్లోని వివిధ కంపెనీల పత్తి విత్తన ప్యాకెట్ల నమూనాలను సేకరించి వివరాలను నమోదు చేసుకున్నారు. సేకరించిన విత్తనాలను నాణ్యతను పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపిస్తామని సారిక ఏఓ తెలిపారు. విత్తన నాణ్యత పాటించాలని డీలర్లకు సూచించారు.

**నేడు డీలర్లతో సమావేశం**

రాయికోడ్‌లోని రైతువేదికలో బుధవారం మండలంలోని ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు ఏఓ సారిక మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉ.10 గంటల నుంచి సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో ఎరువులు, విత్తనాల విక్రయానికి సంబంధించిన ప్రభుత్వ నిబంధనలు, దుకాణాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీలర్లకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

### నాడు ఎండి.. నేడు నిండి



రెండు నెలల ముందు



ప్రస్తుతం

కష్టనష్టాలతో అన్నీ కోల్పోయినా ఆత్మవిశ్వాసంతో మళ్లీ జీవితంలో అడుగులు వేయవచ్చు. తిరిగి అన్నీ సంపాదించుకోవచ్చు. జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ జర్నలిస్టు కాలనీలో ఉన్న ఈ చెట్టు అదే చెబుతోంది. సరిగ్గా రెండు నెలల క్రితం ఆకులు లేక ఎండిపోయి కనిపించిన చెట్టు ప్రస్తుతం మళ్లీ చిగురించి కొత్త కళను సంతరించుకుంది. పచ్చని ఆకులతో తిరిగి జీవం పోసుకుంది. మనిషి జీవితమూ అంతే.

– జహీరాబాద్ టౌన్

### దుర్గాదేవికి ఒడి బియ్యం సమర్పణ

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని జాడీమల్కాపూర్‌లో దుర్గాదేవి జాతర ఉత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి దర్శించుకున్నారు. మంగళవారం గ్రామ ప్రజలు అమ్మవారికి బోనాలు తీసి ఒడిబియ్యం పోశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జహీరాబాద్: నియోజకవర్గంలోని 24 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. మంగళవారం పట్టణంలోని మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయంలో న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.11 లక్షల విలువ గల చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు రామలింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్‌రావు పాటిల్, మక్సూద్, అర్షద్ అలీ, రాములు చెక్కులు అందజేశారు.